క్లుప్తంగా

వయో పరిమితి పెంపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయో పరిమితి పెంపుపై ఎస్ఎస్‌యూఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఐఎన్టీయూసీ నాయకులతో కలిసి సీసీసీ కార్నర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు డిపెండెంట్ల వయో పరిమితి 35 ఏళ్ల నుంచి, నేడు 40 ఏళ్లకు పెంచినట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల అనేక మంది డిపెండెంట్లకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జె. శంకర్‌రావు, నాయకులు తిరుపతిరెడ్డి, వెంగళ కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్యలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏవోగా ప్రేమ్‌కుమార్



బెల్లంపల్లి: బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారిగా ఎస్.ప్రేమ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి మండల ఏవోగా పని చేస్తున్న ప్రేమ్‌కుమార్ నెన్నెల మండలానికి డెప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రభుత్వం డెప్యూటేషన్‌లను రద్దు చేయడంతో తిరిగి బెల్లంపల్లికి వచ్చారు. ఇన్‌చార్జి ఏవోగా విధులు నిర్వహిస్తున్న వందన నుంచి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

చెన్నూర్ ఏవోగా శ్రీనివాస్



చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయాధికారిగా ఎస్. శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. జైపూర్ ఏవో మార్క్ గ్లాడ్‌సన్ ఇంత కాలం చెన్నూర్ ఇన్‌చార్జి ఏవోగా పని చేశారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను చెన్నూర్ ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

ఖాళీలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని డిపార్టుమెంట్లు, ఓసీపీలు, వర్క్‌షాప్, స్టోర్స్, డిస్పెన్సరీల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ బ్రాంచీ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేశ్, పాగాకు రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేశ్‌రెడ్డి, సాదుల భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలంటే, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. చాలా కాలంగా వీటి భర్తీ కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారన్నారు.

ఫుట్‌పాత్ కబ్జాలు అరికట్టాలి



ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియాలో ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ... కొందరు షాపుల యజమానులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఫుట్‌పాత్ స్థలం లేకుండా చేశారని, ద్విచక్ర వాహనాలను పార్కింగ్‌కు స్థల సమస్య ఏర్పడేటట్లు చేశారని పేర్కొన్నారు. కొందరు కబ్జా చేసిన స్థలాన్ని అద్దెకు ఇస్తున్నారని స్థానికుడు శ్రీనివాస్ తదితరులు ఏసీపీకి విన్నవించారు. ఫుట్‌పాత్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

విద్యార్థుల ఇంటికివెళ్లి అడ్మిషన్..

మందమర్రిరూరల్: మోడల్ స్కూల్లో 6వ తరగతిలో సూర్య, హన్సిత్ అనే విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన జాబితాలో ఉన్నారు. ఆ విద్యార్థులు బుధవారం వరకు కూడా అడ్మిషన్ తీసుకోలేదు. విద్యార్థుల అప్లికేషన్ ఫాం ఆధారంగా అడ్రస్ పోస్ట్‌మెన్ సహకారంతో తెలుసుకున్న స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి స్కూల్ ఉపాధ్యాయుడితో కలిసి విద్యార్థుల ఇంటికి వెళ్లి అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు సమాచార లోపం వల్ల సీటు కోల్పోకూడదనే ఉద్దేశంతో విద్యార్థుల ఇంటికెళ్లి అడ్మిషన్ ఇచ్చామని తెలిపారు.



జిల్లా కేంద్రంలో పవర్ పెట్రోల్ పోసుకుంటున్న వాహనదారుడు

పవర్ భారం!

- జిల్లాలో నిబంధనలు పాటించని బంకులు
- సాధారణ పెట్రోల్‌కు బదులు పవర్ పెట్రోల్ విక్రయం
- వినియోగదారులపై లీటర్‌కు రూ.7 అదనపు భారం

మంచిర్యాలఅగ్రికల్చర్: పెట్రోల్ ధరలు ఇప్పటికే వాహనదారులకు చుక్కలు చూపిస్తుంటే, మరోవైపు జిల్లాలో కొన్ని పెట్రోల్ బంకులలో నార్మల్ పెట్రోల్‌కు బదులుగా పవర్ పెట్రోల్ మాత్రమే అమ్ముతూ వినియోగదారులపై ఆర్థిక భారం మరింత మోపుతున్నారు. నార్మల్ పెట్రోల్ లీటర్‌కు రూ.108.42 ఉండగా, పవర్ మాత్రం పెట్రోల్ రూ.115.44 ధర ఉంది. పెట్రోల్ బంకుకు వెళ్లిన వాహనదారునికి పవర్ పెట్రోల్ పోసేదాక తెలియడం లేదు. రెగ్యూలర్‌గా నార్మల్ పెట్రోల్ పోసుకునే వాహనదారుడు పవర్ పెట్రోల్ పోయడంతో లీటర్‌కు రూ.7 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇదేమి అంటే నార్మల్ పెట్రోల్ లేదంటున్నారు. కొన్ని బంక్‌లలో నార్మల్‌కు బదులు పవర్ పెట్రోల్‌నే ఎక్కువగా కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఓన్లీ పవర్ పెట్రోల్ అని బోర్డు పెడుతుంటే, కొన్ని బంకులలో నిర్వాహకులు పెట్రోల్ పోసిన తర్వాత నగదు చెల్లించే వరకు కూడా తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. దీంతో నిర్వాహకులపై వాగ్వివాదానికి దిగుతున్నారు. ఒకసారి నార్మల్ పెట్రోల్, మరొకసారి పవర్ పెట్రోల్ పోస్తే వాహనాలు మైలేజీతో పాటు ఇతర ఇబ్బందులు వస్తున్నాయని వాపోతున్నారు. వివిధ ఆయిల్ కంపెనీలు, బంకుల యాజమానుల లాభదాయకం కోసమే పవర్ పెట్రోల్ విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పెట్రోల్ నాణ్యత, ఫిల్టర్ పేపర్, డెన్సిటీ, ప్రథమ చికిత్స, తదితర పరిమాణాలు పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

పెట్రోల్ బంకులలో సౌకర్యాలు నిల్..

బంకుల వద్ద నీడతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, గాలినింపుట, ఫైర్‌సేఫ్టీ, తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కొన్ని బంకులు నిబంధనలు పాటించడం లేదు. కొన్ని బంకుల్లో ఏర్ కంప్రెషర్ ఉంటున్నా, గాలి నింపుటకు నిర్వాహకులు ఉండడం లేదు. వినియోగదారులకు కనీస సౌకర్యాలు, నిబంధనలు పాటించని బంకులపై ఎలాంటి చర్యలు ఉండడం లేదు. గతంలో కొన్ని బంకులు పెట్రోల్‌కు బదులు నీరు రావడంతో, వినియోగదారులు వాగ్వివాదానికి దిగి ఆందోళన చేపట్టిన ఘటనలూ ఉన్నాయి.

నార్మల్ పెట్రోల్ లేదంటున్నరు..



పెట్రోల్ పోసే వరకు కూడా తెలియడం లేదు. నార్మల్ పెట్రోల్ బదులు పవర్ పెట్రోల్ పోశారని అడిగితే, నార్మల్ లేదు పవర్ పెట్రోల్ మాత్రమే ఉందని, సమాధానం చెబుతున్నారు. నార్మల్ రూ.108 అయితే పవర్ రూ.115 తీసుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్ ధర ఎక్కువగా ఉందంటే, పవర్ పెట్రోల్‌తో రూ.7 ఎక్కువగా చెల్లించుడు, ఒకసారి నార్మల్, పవర్ పెట్రోల్ పోయడంతో బండ్లు పాడాయితన్నయ్. నార్మల్ పెట్రోల్ అందుబాటులో ఉంచాలి.

\- భీమరాజుల సతీష్, మంచిర్యాల

పవర్ పెట్రోల్‌తో పరేషాన్...



నార్మల్ పెట్రోల్ లేదని, పవర్ పెట్రోల్ కొట్టిస్తే రూ.7 లు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికే పెట్రోల్ ధరలు ఎక్కువయ్యాయంటే, పవర్ పెట్రోల్‌తో మరింత ఎక్కువ భారం పడుతుంది. వాహనాలలో గాలి నింపుటకు ఎయిర్ కంప్రెషర్ చూపిస్తున్నా, నిర్వాహకులు ఎవరూ ఉండటం లేదు. నార్మల్ పెట్రోల్‌తో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- నాగుల వెంకటేష్, మంచిర్యాల

చర్యలు తప్పవు..



జిల్లాలో పెంట్రోల్ బంకల యజమానులు నాణ్యతా, నిబంధనలు పాటించాలి. వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. నార్మల్ పెట్రోల్, పవర్ పెట్రోల్, డీజిల్ వాహనాదారులకు అందుబాటులో ఉంచాలి. పవర్ పెట్రోల్ మాత్రమే అందుబాటులో ఉంచడం సరికాదు. నాణ్యతా, నిబంధనలు పాటించకుంటే బంక్‌లపై చర్యలు తీసుకుంటాం.

\- మోతీలాల్, జిల్లా అదనపు కలెక్టర్

వెంకట్రావుపల్లి కార్యదర్శిపై డీఎల్‌పీవో విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో ధర్మరాణి

జైపూర్: విధులపై అశ్రద్ధ చేస్తూ ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెంకట్రావుపల్లి పంచాయతీ కార్యదర్శి రమాదేవిపై వచ్చిన ఫిర్యాదులపైన డీఎల్‌పీవో ధర్మరాణి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జైపూర్ మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం స్థానిక ప్రజల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవిపై వచ్చిన ఫిర్యాదులపై విచారించారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన ప్రజాపాలనలో భాగంగా పలు పథకాల కోసం దరఖాస్తులు చేసుకోగా, వాటిని సకాలంలో ఆన్‌లైన్లో నమోదు చేయకపోవడంతో సుమారు 15మంది లబ్ధిదారులు నష్టపోయారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యాలయానికి సక్రమంగా రాకపోవడం ప్రజాస మస్యలను పట్టింపు చేయడం లేదని స్థానికులు వాపోయారు. కాగా పంచాయతీ కార్యదర్శి రమాదేవిని అధికారులు వివరణ కోరగా కటాఫ్ గడువు లోపు ఆన్‌లైన్లో నమోదు చేయలేకపోయానని, గడువు ముగిశాక ప్రయత్నించినా ఆన్‌లైన్ కాలేదని తెలియజేసినట్లుగా తెలిపారు. ఇందులో ఎంపీవో అనిల్, స్థానిక ప్రజలు ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



చర్చిస్తున్న చైర్ పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం చైర్‌పర్సన్ శ్వేత సమీక్ష చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, పలువురు కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ పైపులైన్ పనులు వేగవంతంగా చేపట్టాలని, పారిశుద్ధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు బండి ప్రభాకర్, కొమ్ము సురేష్, మున్సిపల్ ఏఈ సందీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఎరువులు తనిఖీ చేస్తున్న డీఏవో

కోటపల్లి: అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ హెచ్చరించారు. సర్వాయిపేట గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, రసీదులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని యజమానులకు సూచించారు. రైతులకు కనబడే విధంగా విత్తనాల స్టాక్ వివరాలు, ధరలు రోజువారీగా నోటిసు బోర్డుపై రాయాలని ఆదేశించారు. అధిక ధరలకు అమ్మినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచకపోయినా వేరే జిల్లాకు విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవో రాజుకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేతో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్

చెన్నూర్: మున్సిపాలిటీలో నిలిచిపోయిన రూ.28కోట్ల అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్ తెలిపారు. ఈ సందర్భంగా నవాజ్ మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.28కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని, నిధుల మంజూరుకు సంబంధించిన జీవో పత్రాలను సైతం ఎమ్మెల్యేకు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారని జీవో కాపీలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా ఉన్నారు.

దుగ్నెపల్లిలో ఉపాధ్యాయుల సర్వే

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లిరూరల్: 'మా ఊరి టీచర్ ను బదిలీ చేయండి' అంటూ బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజు కాంబ్లే సక్రమంగా విధులకు హాజరుకాక పోవడంతో విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంగళవారం దుగ్నెపల్లి గ్రామస్తులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశా రు. గురువారం బెల్లంపల్లి మండల విద్యాధికారి పి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాలతో ఉపాధ్యాయులు రాజన్న, జావీద్‌లు దుగ్నెపల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎంత మంది విద్యార్థులున్నారు, వారు ప్రస్తుతం ఏఏ పాఠశాలల్లో చదువుతున్నారనే వివరాలను నమోదు చేసుకున్నారు. గ్రామంలో 28 మంది విద్యార్థులు ఉన్నారని నిర్ధారించుకున్నారు. ఆ వివరాలను ఎంఈవో, ఉన్నతాధికారులకు అందజేసి ఉపాధ్యాయుని ఏర్పాటుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోష్‌కుమారి, బానయ్య, శ్రీనివాస్, నాగరాజు, వెంకటస్వామి, విజయ్ పాల్గొన్నారు.

ప్రజాసేవే మా అభిమతం..

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



హాజీపూర్‌లో తోఫా పంపిణీ చేస్తున్న సురేఖ

దండేపల్లి: అధికారంలో లేకున్నా, ఉన్నా ప్రజాసేవ చేయడమే మా అభిమతం అని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ అన్నారు. కొక్కిరాల రఘుపతి రావు ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ముస్లింలకు అందించిన బక్రీద్ తోఫాను గురువారం రాత్రి దండేపల్లిలో పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా మంచిర్యాల నియోజకవర్గంలోని మహిళలకు బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్ తోఫాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ శ్రీనివాస్, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం ముస్లిం కుటుంబాలకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో తోఫా పంపిణీ చేశారు. బక్రీద్ పర్వదినోత్సవాన ఇవ్వాల్సిన తోఫాలను ఎలక్షన్ కోడ్ కారణంగా వాయిదా వేశారు. కోడ్ ముగియడంతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఆధ్వర్యంలో ముస్లిం మహిళా సోదరీమణులకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా బక్రీద తోఫాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజ్, డీసీసీ ఉపాధ్యక్షురాలు మాధవరపు రాజేశ్వర్‌రావు, మల్యాల రాజు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం: బక్రీద్ సందర్భంగా కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ముస్లిం మహిళలకు బక్రీద్ తోఫా అందజేశారు.

పండగ శాంతియుతంగా జరుపుకోవాలి

తాండూర్: పండగలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. బక్రీద్ నేపథ్యంలో తాండూర్ సర్కిల్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ తమ పండగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పండగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చొరవ తీసుకోవాలని, ఒకరినొకరు రెచ్చగొట్టుకునే విధంగా ఎవరూ వ్యవహరించవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

సమాచారం

15 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

తాండూర్: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా తాండూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో ఈ నెల 15, 16వ తేదీల్లో తాండూర్ సీఐ కె.కుమారస్వామి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. మాదారం పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనదలచిన యువకులు ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ఎస్సైలను సంప్రదించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం తాండూర్ ఎస్సై 87126 56575, భీమిని ఎస్సై 87126 56578, కన్నెపల్లి ఎస్సై 87126 56577, మాదారం ఎస్సై 87126 56576లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

15న పశువుల సంత వేలం

జన్నారం: ఈ నెల 15న జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంత వేలం ఉంటుందని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 15న ఉదయం 9గంటల నుంచి 12గంటల లోపు డిపాజిట్ చేసుకోవాలన్నారు. డిపాజిట్ చేసుకున్న వారే వేలంలో పాల్గొననున్నట్లు సూచించారు. గ్రామ పంచాయతీ విధించిన షరతులు అందరికీ వర్తిస్తాయని పేర్కొన్నారు.

16న సమావేశం

పాతమంచిర్యాల: మంచిర్యాల పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఠాకూర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ఎన్నికల నిర్వహణ కోసం అడహక్ కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందని, సొసైటీ సభ్యులు తప్పకుండా సకాలంలో హాజరు కావాలన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో అవగాహన

చెన్నూర్‌రూరల్: మను యూనివర్సిటీ ప్రొఫెసర్, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ సభ్యురాలు వనజ శుక్రవారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విచ్చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనుకునే విద్యార్థులకు వీరు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చని వివరించారు.

18, 19న ఈపీ ఆపరేటర్ల ట్రైనీ సెలక్షన్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: ఈ నెల 18, 19తేదీల్లో ఏరియాలోని ఈపీ ఆపరేటర్ ట్రైనీల కోసం ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. ఏరియాలోని జీఎం చాంబర్లో అధికారులతో ఎంపికపై గురువారం సమీక్ష నిర్వహించారు. మందమర్రి బెల్లంపల్లి ఏరియాలో 187మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వారికి 18, 19తేదీల్లో ఉదయం ఆరు గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఈపీ ట్రైనీల ఎంపిక ప్రక్రియ ఉన్నందునా ఈ నెల 16 నుంచి 19వరకు గ్రౌండ్‌లోకి ఇతరులు అనుమతించబడరని, కావున గ్రౌండ్‌కు వ్యాయామం, వాకింగ్, ఆటల కోసం వచ్చే వారు నాలుగు రోజులు సహకరించగలరని జీఎం కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మందమర్రిరూరల్: వచ్చే వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వ వైద్యాధికారి రమేష్‌తో కలిసి మండల స్థాయి అధికారులకు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించాలని, కాల్వలోని పూడికను తీయించాలని, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రజలు ఏదైనా అస్వస్థతకు గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని సూ చించారు. ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా, ఐకేపీ ఏపీఎం లలిత కుమారి, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

జైపూర్: మండలంలోని రామారావుపేట గ్రామ శివారులో గల వ్యవసాయ భూములకు, మిగులు భూములకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ రామారావుపేట నివాసి నామాల తిరుపతి జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. రామారావుపేట శివారులో ఐకే-ఓసీపీ వోబీ మట్టి డంపు చేస్తున్నారని, ఈ క్రమంలో గ్రామంలో గల వ్యవసాయ పొలాలకు, మిగులు భూములకు వెళ్లే రోడ్లను తొలగించుటకు ప్రయత్నం చేస్తున్నారని పలుమార్లు సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలీసు అధికారులు చొరవ చూపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

పనులు పూర్తి చేయండి

వేమనపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. వేమనపల్లి మండలంలోని జిల్లెడ, సూరారం గ్రామపంచాయతీల్లోని పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం కాగా పెండింగ్‌లో ఉన్న తాగునీరు, కరెంట్, మరుగుదొడ్లు ఇతర పనులను పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల సవరణకు అవకాశం

దండేపల్లి: ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నుంచి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల కోసం గత డిసెంబర్, జనవరి నెలల్లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న వారు, అందులో ఏమైనా తప్పులు దొర్లి ఉంటే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అందించి సవరించుకోవాలన్నారు.

మిత్రుల ఔదార్యం..

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన కొదురుపాక మల్లేష్, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి అతని బాల్యమిత్రులు అండగా నిలిచారు. మిత్రులందరూ కలిసి రూ.1.5లక్షలు జమచేసి మల్లేష్ కూతురు ఆరాధ్య పేరున ఫిక్సుడ్ డిపాజిట్ చేశారు. గురువారం బాండును అందించారు.

'పీఎస్‌ఆర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'

నస్పూర్: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుకు మంత్రి రావాలని కోరుకుంటూ సీసీసీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం పార్టీ 22వ వార్డు ఇన్‌చార్జి సంజీవ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నంది వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందగా అతడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును గురువారం అందించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్ జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏవో శ్రీనివాస్ గురువారం వాహనాలను తనిఖీ చేశారు.

కొనసాగుతున్న 'భగీరథ' సర్వే

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం, సూరారం గ్రామాల్లో గురువారం ఎంపీడీవో దేవేందర్ రెడ్డి పర్యటించారు. మిషన్ భగీరథ సర్వేలో భాగంగా నీరు వస్తున్నా యా, రావట్లేదా..పరిశుభ్రంగా ఉన్నాయా అనే వివరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు.